## 40వ అధ్యాయం

ధర్మం అంటే ఏమిటో మహనీయ ముహమ్మద్ (సఅసమ్) ఇలా సెలవిచ్చారు: "హృదయపూర్వకంగా అల్లాహ్ ఆజ్ఞల్ని తు.చ. తప్పకుండా పాటించటం; ఆయన ప్రవక్త (సఅసమ్) పట్ల, ముస్లిమ్ నాయకుల పట్ల, ముస్లిముల పట్ల శ్రేయోభిలాషత్వం కలిగి ఉండటం. అల్లాహ్ దివ్యఖురానులో తౌబా సూరాలో ఇలా సెలవిచ్చాడు: "ఒకవేళ వారు అల్లాహ్ మేలును, ఆయన ప్రవక్త మేలును కోరుతున్నట్లయితే."

**(9 : 91)**

**54.** హజ్రత్ జరీర్ బిన్ అబ్దుల్లాహ్ (రజిఅన్) ఇలా చెప్పారు: నేను ఈ క్రింది విషయాలను గురించి మహాప్రవక్త (సఅసమ్)కు ప్రమాణం చేసి వాగ్దానం చేశాను: "నియమం తప్పకుండా చక్కగా నమాజు చేస్తాను; జకాతు ఇస్తాను: ప్రతి ముస్లింకు శ్రేయోభిలాషిగా ఉంటాను."

**55.** జయ్యాద్ బిన్ ఇలాఖా (రజిఅన్) కథనం : కూఫా గవర్నరు అల్ ముగైరా బిన్ షుఐబా (రజిఅన్) మరణించిన రోజున, జరీర్ బిన్ అబ్దుల్లాహ్ ఇలా అంటూ ఉండగా నేను విన్నాను. ఆయన ఉపన్యాసం చెయ్యటానికి లేచి నిలబడ్డారు; అల్లాహ్‌ను స్తుతించారు, ఆయన గుణ విశేషాలను ప్రస్తుతించారు. ఆ తరువాత ఇలా అన్నారు: "మీరు కేవలం ఒక్క అల్లాహ్‌కు మాత్రమే భయపడాలి. ఆయనకు భాగస్వామి ఎవ్వడూ లేడు. కొత్త గవర్నరు వచ్చే వరకు మీరందరూ ఓపిక పట్టాలి, సహనంతో ఉండాలి. అతను త్వరలోనే వస్తున్నాడు కూడా." ఇంకా ఆయన ఇలా అన్నారు : "మరణించిన మీ గవర్నరును క్షమించమని మీరంతా అల్లాహ్‌ను ప్రార్థించండి. ఇతరుల్ని మన్నించటమంటే ఆయనకు ఎంతో ఇష్టం." తరువాత ఆయన మళ్లీ ఇలా అన్నారు: "నేను మహాప్రవక్త ముహమ్మద్ (సఅసమ్) వద్దకు వెళ్లాను. ఇస్లామ్‌ను గురించి నేను మీతో బైతు చేస్తున్నాను" అని ఆయనకు చెప్పాను. దానికి ఆయన "ప్రతీ ముస్లిమ్ శ్రేయస్సును కోరాలి" అనే షరతును విధించారు. ఈ షరతుకు అనుగుణంగా నేను ఆయనతో బైతు చేశాను. ఈ మసీదు ప్రభువు సాక్షిగా చెబుతున్నాను: నేను మీ అందరి మేలును కోరుతున్నాను. "నేను మీ శ్రేయో భిలాషిని" అల్లాహ్‌ను క్షమించమని వేడుకుంటూ మెంబరు మీద నుంచి క్రిందికి దిగారు. ః